www.prajasakti.com

# ప్రజాశక్తి

మంగళవారం 9 సెప్టెంబర్ 2025

5

అన్నమయ్య





సిఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, ముదివేడు బాధితులు

కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వ్య.కా.స నాయకులు



# అట్టహాసంగా వ్య.కా.స జాతీయ సమావేశాలు ప్రారంభం

- ఎర్రజెండా రెపరెపల మధ్య భారీ ర్యాలీ, బహిరంగ సభ
- చూపరులను ఆకట్టుకునేలా చెక్కభజన, నృత్యాలు
- ర్యాలీ పొడవునా విప్లవగీతాలు, జానపద గేయాలాపన
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు హాజరు

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లాలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాలు ఎంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి కడప నగరంలోని హరిత హోటల్ ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ కోటిరెడ్డిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్ల కూడలి, జ్యోతిరావు పూలే సర్కిల్ మీదుగా పాతబస్టాండు వరకూ సాగింది. ర్యాలీ పొడవునా వ్యవసాయ కార్మికుల ముందుభాగాన చెక్కభజన కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు, వినూత్ననృత్యాల ప్రదర్శనలు చూపరులను అలరించాయి. చెక్కభజన బృందం వెనుకభాగాన అఖిల భారత వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలకు చెందిన పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు భారీ బ్యానర్‌ను చేతబట్టుకుని భారీర్యాలీ ప్రదర్శనగా ముందుకు సాగారు. ముందు వరుసలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, మలి వరుసలో మహిళలు, చివరి వరుసలో పురుషులతో కూడిన పటాలం ప్రదర్శన సైనిక కవాతును తలపించేలా సాగింది. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జి.శివకుమార్ జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులను పరిచయం చేస్తూ బహిరంగ సభ వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ సభాధ్యక్షత వహించి సభను జయప్రదంగా నిర్వహించారు. బహిరంగసభ వేదిక నుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ, రాష్ట్ర నాయకులు ప్రసంగం అనంతరం ప్రసంగ సారాంశాన్ని వివరించడం, తరువాత వారిని ప్రసంగించే అవకాశాల్ని వరుస క్రమంలో కల్పించారు. జాతీయ, రాష్ట్ర నాయకుల ప్రసంగాలు కార్మికులు, ప్రజలను ఆకట్టుకున్నాయి. చివరన జిల్లాకు చెందిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం ఎంతో ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 14 పోరాటాలు నిర్వహించగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం తొమ్మిది భూపోరాటాలను నిర్వహించిన ఘనత దక్కించుకుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు నిర్వహించడానికి అవసరమైన అనుభవం గడించిందని తెలిపారు. జిల్లాలో సమగ్ర భూ పంపిణీ, ఉపాధి హామీ, జిల్లా సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం అనే అంశాలపై జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. అనంతరం భవిష్యత్ ప్రణాళికలను రూపకల్పన చేసుకుని వాటి అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మంగళ, బుధవారాలు 22 రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల పోరాట అనుభవాల సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో 22 రాష్ట్రాలకు చెందిన 200 మంది వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ, రాష్ట్ర నాయకులు, జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో పిఎన్ఎం కళాకారుల నృత్య ప్రదర్శన



బహిరంగ సభకు హాజరైన నాయకులు, వివిధ సంఘాల కార్మికులు



ర్యాలీలో నేనుసైతం అంటున్న చిన్నారులు



ర్యాలీలో జానపద కళాకారుల నృత్య ప్రదర్శన



బహిరంగ సభలో ఐక్యతను చాటుతున్న జాతీయ నాయకులు

'ముదివేడు' నిర్వాసితులకు

# నష్టపరిహారం చెల్లించాలి

**- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు**

**ప్రజాశక్తి - కడప సిటీ**

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ముదివేడు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరుతూ కడప చీఫ్ ఇంజినీరు (ప్రాజెక్టులు) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ముదివేడు రిజర్వాయర్ నిర్మించాలని తలపెట్టి అనేక అవకతవకలకు పాల్పడి రైతులను ముంచే సిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం పోరాటం ఫలితంగా ముంపునకు గురయ్యే భూములను, ఇళ్లు గుర్తించడం కోసం ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించి, అవార్డు కూడా ప్రకటించిందని గుర్తుచేశారు. దాదాపు 780 ఎకరాల భూములకు రూ.163 కోట్లు చెల్లించాల్సి ఉండగా 25 ఎకరాల భూమికి రూ.1.75 కోట్లు మాత్రమే చెల్లించారని, మిగిలిన వారికి నష్టపరిహారం ప్రకటించినా అమలుకు నోచుకోలేదన్నారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల పరిధిలోని ఐదు గ్రామాలు పూర్తిగా మునిగిపోతున్నాయని, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని వాపోయారు. భూముల్లో మట్టిని తవ్వేసిన కారణంగా వ్యవసాయానికి పనికి రాకుండా పోయాయని, రిజర్వాయర్ నిర్మాణ సంస్థ రైతులకు లీజు చెల్లిస్తామని చెప్పి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, భూములు, ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ 5 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డికెటి పరిహారం ఇవ్వాలని, భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.5 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం చీఫ్ ఇంజినీరు (ప్రాజెక్ట్స్) ఎం.ఎల్.ఎన్.వరప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, నరసింహ, ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితుల సంఘం నాయకులు రాజేష్, శ్రీనివాసులు, వెంకట్రమణ, గోపాల్, వెంకటరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు

# శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు

**- నిరసన ప్రదర్శనలో సిఐటియు డిమాండ్**

**ప్రజాశక్తి - రాయచోటి అర్బన్**

మున్సిపల్ శానిటేషన్ విభాగంలోని మస్టర్ల అవకతవకలకు పాల్పడిన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్ల సమస్యల పైనా, ఆగస్టు పెండింగ్ వేతనంపైనా సిఐటియు ముఖ్య నాయకులు అత్యవసర నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా రామాంజులు మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ నెల మధ్యలో చనిపోయిన వర్కర్‌కి డెత్ సర్టిఫికెట్ ఇచ్చి నెల పూర్తి జీతం వచ్చేలా హాజరు వేసి ప్రభుత్వానికి జీతాల బిల్ పెట్టడంతో ఆయన ఆడిటర్లకు అడ్డంగా దొరికారని, మూడు రోజుల నుంచి కార్యాలయానికి కూడా రాకుండా జ్వరం పేరుతో పరాయ్యారని ఆరోపించారు. ఇంకో ఐదుగురికి హాజరు పట్టికలో ఆబ్సెంట్ వేసి ప్రభుత్వానికి పంపే జీతాలలిస్టులో ఫుల్ అటెండెన్స్ వేయడం అవినీతికి పాల్పడడమేనని పేర్కొన్నారు. చిట్లూరు రమణమ్మ 5 నెలలుగా పనికి రాకపోయినా హజరు వేసి జీతం ఇచ్చి ప్రభుత్వ ఖజానాకు నష్టం చేశారని పేర్కొన్నారు. విధులకు రాని వారికి హాజరు వేసి జీతాలు ఇచ్చి వారి నుండి ఆర్థిక లబ్ధి పొందారని తెలి పారు. విధులకు రాని వారికి ఆబ్సెంట్ వేసి ఫుల్ జీతం పెట్టిన వారి నుంచి రూ. 6 వేలు ఇవ్వాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ, యఫ్‌వన్ నరసింహులు ఫోన్ చేసి వేధిస్తున్నారని తెలిపారు. విధులకు వచ్చి చిత్తశుద్ధితో పనిచేసే వారికి మూడు, నాలుగు పనులు చెప్పి పని భారం పెంచి మానసికంగా వేధించారని వెంటనే ఆయన మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్లీచింగ్, సున్నం, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టకుండా ప్రజారోగ్యాన్ని గాలికొదిలి కేవలం ధనార్జనే ధ్యేయంగా చేస్తున్నారని వాపోయారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ మాట్లాడుతూ వర్కర్ల వివరాలు రోజూ ప్రజెంట్, ఆబ్సెంట్, సిఎల్ 3 కేటగిరీల వారీగా కమిషనర్ లాగిన్‌లో, గ్రూప్ లో రోజూ పొందుపరిస్తే తప్పుడు మస్టర్లు వేసే అవకాశం ఉండదని తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా కోశాధి కారి రాంబాబు, పట్టణ అధ్యక్షులు యం.చెన్నయ్య వాటర్ సెక్షన్ అధ్యక్షులు అక్బర్, సురేష్ పలువురు వర్కర్లు పాల్గొన్నారు.



అర్జిదారులతో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

# అర్జీలకు తక్షణ పరిష్కారం : జెసి

**ప్రజాశక్తి - రాయచోటి**

పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో, నాణ్యతతో పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమావేశంలో డిఆర్ఒ మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఏడి సర్వేయర్ భరత్ కుమార్, జిఎస్‌డబ్ల్యూఎస్ లక్ష్మీపతి జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను నాణ్యతతో వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో నిశితంగా అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలోగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సమస్యను , ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, ధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. కార్యక్ర మంలో జాయింట్ కలెక్టర్ కు పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

**ప్రజాశక్తి - రాయచోటి**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాయచోటిలో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర అధ్యాపకులు బొంగాని కిరణ్ కుమార్‌కు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ బి.దేవప్రసాద్ రాజు పర్యవేక్షణలో 'ఆప్టికల్ అండ్ లుమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ నియోడియం, ఇటర్బియం, నియోడియం, ఎర్బియం డోప్డ్ ఆక్సిఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ ఫోటోనిక్ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారని తెలిపారు. ఆయన రూపొందించిన పలు పరిశోధన పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయిన్నారు. పలు అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలను సమర్పించారని చెప్పారు. ఒకవైపు ఐ క్యూ ఎసి కో-ఆర్డినేటర్‌గా కళాశాలకు నాక్ అక్రెడిటేషన్‌లో బి ప్లస్ గ్రేడ్ రావటంలో కీలకపాత్ర పోషించి, మరొకవైపు పరిశోధన చేసి డాక్టరేట్ పొందటం అభినందనీయమని ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు.

# రణభేరిని జయప్రదం చేయండి : యుటిఎఫ్

**ప్రజాశక్తి-పీలేరు**

ఏళ్లతరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 15 నుండి 19 వరకు జరగనున్న యుటిఎఫ్ రణభేరిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, కోశాధికారి చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. సోమవారం పీలేరులో రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు పరిష్కారం చూపడం లేదని, బదిలీలు, ఉద్యోగోన్నతులు పూర్తై మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే కొనసా గుతున్నారని, మూడు నెలలుగా మినిమం టైం స్కేల్ ఉపాధ్యా యులకు వేతనాలు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా ప్రపంచ బ్యాంక్ సాల్ట్ పథకం రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా 3వ వంతు ప్రాథమిక పాఠశాలలు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారిపోయాయని, సగానికి పైగా ఉన్నత పాఠశాలలు సింగిల్ సబ్జెక్టు టీచరు స్కూళ్లుగా తయారయ్యాయని చెప్పారు. స్కూలు అసిస్టెంట్లను సర్ ప్లస్ పేరుతో క్లస్టరు టీచర్లుగా, ప్రైమరీ స్కూలు హెడ్మాస్టర్లుగా పనిచేయాల్సిన పరిస్థితులు కల్పించారని పేర్కొన్నారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తామని ఓవైపు చెబుతూనే, మరోవైపు ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రయివేటుకు తరలి పోయేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ అంటూ బోధనకు ఆటంకం కలిగించే పని కావాలనే చేస్తున్నారని విమర్శించారు. ఎన్రోల్మెంట్ డ్రైవ్‌కు పిలుపునిచ్చి తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం, అదే సమయంలో ట్రైనింగ్ పేరుతో ఉపాధ్యాయులను బడికి దూరం చేసారని, తద్వారా తల్లిదండ్రులకు, సమాజానికి ప్రభుత్వ బడి పట్ల నమ్మకం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను ఊపిరి ఆడకుండా చేస్తున్నారని విమర్శించారు. ఆన్లైన్, అప్లోడింగ్ కార్యక్రమంగా విద్యాశక్తి కార్యక్రమాన్ని మార్చివేసి, స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. పరీక్షల మూల్యాంకనం ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చిపడేసారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ, జిల్లా కౌన్సిలర్ వెంకటరమణ, చిన్నరెడ్డెప్ప, విజయకుమార్, పీరయ్య, ఆదినారాయణ, కామేశ్వర పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# నాసిరకం నిర్మాణంపై కమిటీ వేయాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మదనపల్లె**

మదనపల్లె మెడికల్ కాలేజ్ పనులను నాసిరకంగా చేపట్టిన నిర్మాణ పనులపై కమిటీ వేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం వైద్య కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజ్ భవనాల నిర్మాణం నాసిరకంగా ఉన్నాయని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం రూ.65 కోట్లు ఖర్చు పేరుతో భారీగా అవినీతి జరిగిందని ఆరోపించారు. నాణ్యతా లోపాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ యాక్ట్ ద్వారా అక్రమంగా ఖర్చు చేసిన నిధులను రికవరీ చేయాలని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజ్ నిర్మాణం ప్రజల డబ్బుతో జరుగుతుందని, అవినీతి సహించబోమని హెచ్చరించారు. మెడికల్ కాలేజ్ నిర్మాణం కేవలం వైసిపి నాయకుల జేబులు నింపుకోవడానికి నాసిరకం నిర్మాణాలు చేపట్టారని దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి లోకేష్ బాబు స్పందించి వెంటనే కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ పాల్గొన్నారు.

# మదనపల్లె జిల్లాపై ప్రకటన చేయాలి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లె జిల్లాపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాలని జిల్లా సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ఆధ్వర్యంలో జిల్లా సాధన ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ అధికారిక ప్రకటన వచ్చే వరకూ మదనపల్లె జిల్లా సాధన ఉద్యమకారులు ప్రభుత్వ మంత్రివర్గ ఉపసంఘాన్ని కలసి నివేదిక త్వరలో అందజేస్తామన్నారు. గతంలో అప్పటి ప్రభుత్వం మదనపల్లె జిల్లా సాధన ఉద్యమకారులపై అనేక అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. ఆ కేసులను ప్రభుత్వం తొలగించాలని కోరారు. జనసేన రాయలసీమ నాయకులు రాందాస్ చౌదరి మాట్లాడుతూ మదనపల్లె జిల్లా చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఇప్పటికే ఆ ప్రక్రియ మొదలైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మదనపల్లె జిల్లా సాధన నాయకులు యమలా సుదర్శనం, మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాం, అనిత, నాయకులు సురేంద్ర యాదవ్, మనోహర్‌రెడ్డి, నాయకులు రెడ్డి సాహెబ్, కృష్ణప్ప, రెడ్డిబాష, శ్రీరాములు, నాగరాజు, లలితమ్మ, లక్ష్మి, ఆనంద్ పాల్గొన్నారు.

# బైండోవర్ కేసును ఎత్తేయాలి

**ప్రజాశక్తి -రాయచోటి అర్బన్**

సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్‌పై పెట్టిన బైండోవర్ కేసును తక్షణమే ఉపసంహ రించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వి.వెంకట రమణారెడ్డి, కేస రామచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ బొప్పాయి రైతులకు మద్దతు ధర కల్పించాలంటూ చంద్రశేఖర్ పోరాటం చేస్తున్నారన్నారు. సిఐటియు తరపున తమకు వ్యతిరేకంగా పోరాడడాన్ని జీర్ణించుకోలేని మధ్య దళారులు, వ్యాపారులు ఆయనపై బైండోవర్ కేసు బనాయింప చేయడం అక్రమమన్నారు. వెంటనే బైండోవర్ కేసును పోలీసులు ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర లభించకుండా అడ్డుకుంటున్న దళారులు, వ్యాపారుల పై పోలీసులు కేసులు బనాయించాలంటూ డిమాండ్ చేశారు.

**కేసు తక్షణమే ఉపసంహరించుకోవాలి**

సిఐటియు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్‌పై పెట్టిన బైండొవర్ కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎపి సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని కోడూరు, చిట్వేలు, పెనుగులూరు, ఓబులవారిపల్లె తదితర మండలాల్లో రైతులు విస్తారంగా సాగు చేసిన బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా వ్యాపారులు, మధ్య దళారులు రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుల పండించిన బొప్పాయి పంటకు న్యాయమైన గిట్టుబాటు ధర ఇవ్వాలని నెల రోజులుగా రైతుల పక్షాన గట్టిగా నిలబడి పోరాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులుపై సెక్షన్ 126 బిఎన్ ఎస్ఎస్ కింద రైల్వేకోడూరు పోలీసులు బైండో వర్ కేసు బనాయించడం దారుణం అన్నారు, పోలీసుల దుశ్చర్యను సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆయన నిర్ణయించిన రూ.9 ధర కూడా అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్న మధ్య దళారులు, ఢిల్లీ వ్యాపారులపై సెక్షన్ 420క్రింద కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు.

# తప్పడు సమాచారం ఇవ్వొద్దు

**ప్రజాశక్తి- రాయచోటి**


యూరియా నిల్వలపై తప్పడు సమాచారం ఇచ్చి రైతులను రెచ్చగొట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో యూరియా నిలువలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ శ్రీధర్ చామకూరి తన క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలలో అవసరమైన యూరియా నిలువలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం కలెక్టర్ యూరియా నిల్వలపై రైతులకు సమాచారాన్ని ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, ఇప్పటి వరకు జిల్లాలో ప్రయివేట్ డీలర్లు, రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్న యూరియా నిలువలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మార్కెటింగ్ శాఖ అధికారులకు వివిధ సూచనలు చేశారు.

## ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు


కలికిరి : ఎంపీ మిథున్‌రెడ్డితో వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-కలికిరి**

లిక్కర్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్‌పై విడుదలైన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని హైదరాబాద్‌లో పలువురు వైసిపి నాయకులు ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పీలేరు నియోజకవర్గం సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు మద్దిరాల మల్లికార్జున, మండల మైనారిటీ అధ్యక్షుడు వేంపల్లి బావాజీ, ఫయాజ్, క్రిస్టియన్ జిల్లా కార్యదర్శి శామ్యూల్, నాయకులు వెంకటపతి కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. టీవల వైసిపి కలికిరి గ్రామ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన షేక్ హనీఫ్, మిథున్‌రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ గ్రామ కమిటీ అధ్యక్ష బాధ్యతలు తనపై ఉంచినందుకు, తనను విశ్వసించి ఈ పదవి ఇచ్చినందుకు పార్టీ నేతలకు, ముఖ్యంగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ సభ్యులు జాకీర్, సుభహన్, జావీద్, వైసిపి కార్యకర్తలు, అభిమానులు, కలికిరి పట్టణ యువత పాల్గొన్నారు. ముస్లిం మైనారిటీ రాష్ట్ర మాజీ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, వైసిపి సీనియర్ నాయకులు రత్నశేఖరెడ్డి కూడా మిథున్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మిథున్ రెడ్డి పూల బుకేని అందించి ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. **రైల్వేకోడూరు :** మధ్యంతర బెయిల్ పై విడుదలైన ఎంపీ మిథున్‌రెడ్డిని నియోజకవర్గ వైసిపి నేతలు హైదరాబాదులోని ఆయన స్వగృహం నందు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాల గురించి మిథున్ రెడ్డికి వివరించారు. ఎంపీని కలిసిన వారిలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, చిట్వేలి మండల వైస్ఎంపిపి చెవు శ్రీనివాసులరెడ్డి, నాగేంద్ర యాదవ్, తోట శివ సాయి, గుని శెట్టి రమేష్, సాయి కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. **పీలేరు:** రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని పీలేరు నియోజక వర్గానికి చెందిన పలువురు వైసిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గం వైసిపి నాయకులు వేర్వేరుగా ఎంపీని హైదరాబాదులోని ఆయన నివాస ంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఎంపీని కలసిన వారిలో ఎం. సునీల్‌రెడ్డి, విద్యార్థి నాయకుడు సుంకరచక్రధర్,ద్వారకనాథరెడ్డి ఉన్నారు.


పీలేరు : ఎంపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సునీల్

## ఇంటింటా చదువు..ఊరంతా వెలుగు


వయోజన విద్యపై అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖ అధికారులు

**ప్రజాశక్తి-సుండుపల్లి**

మండలంలోని వయోజనులు చక్కగా విద్య నేర్చుకుని దేశ అభివృద్ధికి ప్రగతి బాటలు వేయాలని ఎంఇఒ2 రవీంద్రనాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సుండుపల్లిలో వయోజన విద్యపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వయోజన విద్య ఆవశ్యకతను, ఇల్లాలు చదువు ప్రాముఖ్యతపై వివరించి చెప్పారు. ప్రజలతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ2 మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువు కోవాలని సూచించారు. నిరక్షరాస్యత వల్ల దోపిడీలకు, సాంఘిక అరాచకాలకు గురవు తారన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సురేష్‌బాబు, ఎంఎం, ఎంఎన్‌ఆర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే అన్నదాత పోరు : టిడిపి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

వైసిపి తన ఉనికిని చాటుకునేందుకే రైతు పోరుబాట కార్యక్రమం చేపట్టిందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి హెరిటేజ్‌లో ఉల్లిపాయలు అమ్ముతున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. హెరిటేజ్ లో కేవలం పాలు, పాల పదార్థాలు మాత్రమే అమ్ముతారని కూడా తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యూరియా కొరత ఎక్కడా లేదని ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో రైతులకు యూరియాను అందిస్తున్నారని తెలిపారు. ఉల్లిపాయలను క్వింటాలు రూ. 1,200లతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధరలు లేక రోడ్లపై టమోటాలుపరబోసిన రోజులు ఎన్నో ఉన్నాయన్నారు. సమావేశంలో టిడిపి బిసి రాష్ట్ర అధి.కార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, చాంద్‌బాషా, మాజీ ఎంపిటిసి బాలినేని చంద్రశేఖర్ నాయుడు, కృష్ణ ప్ప, మణి ప్రకాష్, సి.బాలాజీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌జె వెంకటేష్

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి**

సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఆరు ప్రాథమిక కేంద్రాల పరిధిలోని పనిచేస్తున్న సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో జయరామయ్య మాట్లాడుతూ పురుష ఆరోగ్య కార్యకర్తలు ప్రతిరోజూ తమ కేటాయించిన గ్రామాలకు సందర్శించి లార్వా, జ్వరాల సర్వేలను నిర్దేశించిన ఫార్మేట్ ప్రకారం అందించాలన్నారు. జ్వరాల కేసులను గుర్తించి వారి నుండి రక్త నమూనాలను సేకరించి పిహెచ్‌సి ల్యాబ్‌కు పంపించాలని సూచించారు. గ్రామాలలోని పైపులు లీకేజీలు పంచాయతీ కార్యదర్శులు ద్వారా గుర్తించి వాటిని మరమ్మతులు చేయించాలన్నారు. గ్రామాలలో అపరిశుభ్రత పారిశుద్ధ్య వాతావరణం ఉంటే వాటిని వెంటనే పంచాయతీ అధికారి ద్వారా శుభ్రం చేయించాలన్నారు. ఊరు బయట పేడ దిబ్బలు, ఫ్రైడే డ్రైగా పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు పారిశుధ్య చర్యలను మెరుగు పరచుకోవాలన్నారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు ప్రబలకుండా ఇంటిలోని నీటి తొట్టెలను తరచూ శుభ్రంగా చేసుకోవాలన్నారు. దోమల నియంత్రణ చర్యలు పాటించాలన్నారు. అంటువ్యాధులు నియం త్రణపై 104సేవలు అందుబాటులో ఉంటాయని ప్రతి గ్రామ ంలో పాఠశాలలోనూ జన సమూహం ఉన్నచోట ఏర్పాటు చేసి మలేరియా డెంగీ, టైఫాయిడ్ అధికార డీసెంట్రీ కామెర్లపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్వైజర్లు, ఎన్ఎంలు పాల్గొన్నారు.

# సమతుల్య ఎరువులతో అధిక దిగుబడులు


గాలివీడు : వరిపంటను పరిశీలిస్తున్న తహశీల్దార్ భాగ్యలత

**ప్రజాశక్తి-రామాపురం**

రైతులు సాగు చేసిన పంటలలో అధిక దిగుబడులు పొందాలంటే ఎరువులను సమతుల్యంలో పంటలు వేయాలని మండల ప్రత్యేక అధికారిణి లక్ష్మీదేవి రైతులకు సూచించారు. మండలంలోని నల్లగుట్టపల్లి , సరస్వతిపల్లి గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించారు, ఈ సందర్భంగా రైతులు ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ యూరియా వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులు యూరియా వాడకం తగ్గించాలని రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం లోపిస్తుందన్నారు. వ్యవసాయ అధికారిణి నాగమణి మాట్లాడుతూ వ్యవసాయంలో జీవసంబంధ ఎరువులు వినియోగం వల్ల భూమికి మేలు జరుగుతున్నారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ ఘన జీవామృతం గురించి దాని వల్ల కలిగే ప్రయోజనం గురించి రైతులకు వివరించారు. నానో ఎలా చేయాలో వ్యవసాయ అధికారులు డెమో రూపంలో రైతులకు విరిచారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ రమేష్‌రెడ్డి, రెండు గ్రామాల రైతు సేవ కేంద్రం వివిఎలు, మనేనూర్ , సాయి , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** చిన్నమండెం మండల పరిధిలోని వండాడి, కొత్తపల్లి గ్రామాలలో నానో ఎరువులు, జీవన ఎరువులపై మండల వ్యవసాయ అధికారి గీత ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో మండల వ్యవసాయ అధికారి గీత మాట్లాడుతూ యూరియా అధికంగా వాడడం వలన భూసారం క్రమంగా తగ్గుతుందని,భూగర్భ జలాలు కలుషితమవుతాయని పంటలకు చీడపీడల ఉధృతి పెరుగుతుందని, పంట ఉత్పత్తుల నిల్వకాలం తగ్గుతుందని తెలియజేశారు.కావున రైతులందరూ యూరియా వాడకం తగ్గించి ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, వాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతు భరోసా కేంద్ర సిబ్బంది రైతులు పాల్గొన్నారు. **పుల్లంపేట :**మండల పరిధిలోని రెడ్డిపల్లి, అప్పయ్య రాజుపేట గ్రామ పంచాయతీలలో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. యూరియా వినియోగం పైన రైతులకు అవగాహన కల్పిస్తూ, ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యతను, కలుగు ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయం చేయడం వలన ఖర్చులు తగ్గి ఆదాయం పెంచుకోవచ్చని స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ ఎంపిడిఒ జయశ్రీ, తహశీల్దార్ పుల్లారెడ్డి యూరియా వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతిలు అవలంబించాలని రైతులను కోరారు. ఎమ్మార్వో పుల్లారెడ్డి మాట్లాడుతూ కొత్త తరహా ఎరువులను వాడకం, నానో యూరియా వంటి ఎరువుల్ని రైతులు వాడుతూ సేంద్రియ పద్ధతులను అవలంబించాలని తద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తూ అధిక దిగుబడి పొందాలని రైతులను కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, అభ్యున్నత రైతు చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

### యూరియా అందుబాటులో ఉంది

**కలకడ :** మండలంలో ఉన్న రైతులకు కావలసిన యూరియా అందుబాటులో ఉందని మండల ప్రత్యేక అధికారి దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రాన్ని కలకడ రైతు సేవా కేంద్రంలో యూరియా, నానో ఎరువులు, నవతరం ఎరువుల వాడకం గురించి రైతులతో ముచ్చటించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ మండలంలో ఉన్న రైతులకు కావలసిన ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని సూచించినట్లు తెలిపారు.యూరియా కావలసిన రైతులు స్థానిక సచివాలయాలలో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్దకు పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం తీసుకొని, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, తీసుకొచ్చినచో రైతులకు కావాల్సిన ఏరియాను సరఫరా చేయడం జరుగుతుందని సూచించారు. కలకడ, దేవలపల్లి రైతు సేవా కేంద్రాలలో రైతులకు కావలసిన యూరియా ఒక్కొక్క కేంద్రం నందు 222 బస్తాలు ఉన్నాయని, కావలసిన రైతులు తీసుకొని వెళ్లవచ్చునని తెలిపారు. నానో యూరియా గడ్డి పంటకు పిచికారి చేసుకుంటే పంట అధిక దిగుబడి వచ్చేందుకు అవకాశాలున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శైలజ, ఆర్ ఎస్ కె సిబ్బంది చందన, అనిల్, రైతులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** రైతు లకు యూరియా అందుబాటులోనే ఉందని మండల ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని రెడ్డివారిపల్లె, కొండయ్యగారిపల్లె రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా పంపి ణీ చేస్తున్న కార్యక్రమాన్ని ఎంపిడిఒ రమేష్ బాబు, ఎఒ మంజులతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు అవసరమైన యూరియా అందుబాటులోనే ఉందని తెలిపారు. ఖరీఫ్ సీజన్లో రైతులు అధికంగా వరి సాగును చేస్తుంటారని దీని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రైతులు సాగు చేసిన వరి గణాంకాలను అనుసరించి అవసరమైన యూరియాను అందుబాటులోనే ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు హేమంబార్‌రెడ్డి, శ్రీనివాసులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక అరవీడు పంచాయతీ రెడ్డివారిపల్లిలో తహశీల్దార్ భాగ్యలత రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి యూరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న వరి పంటకు తగ్గట్టు యూరియా అందుబాటులో ఉంటుందని రైతులకుయూరియా దొరుకుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి గౌతమి, రైతులు రాజారెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజసుబ్బారెడ్డి పలువురు పాల్గొన్నారు. అనంతరం వరి పొలాలకు వెళ్లి పరిశీలించారు. **పీలేరు:** మండల పరిధిలోని రైతులు యూరియా వాడకంపై తగిన అవగాహన కలిగి ఉంటూ అవసరమైన మేరకే యూరియా వాడితే మండల పరిధిలో యూరియా కొరత ఉండదని తహశీల్దార్ శివకుమార్ తెలిపారు. మండలంలోని ముడు పులవేమల గ్రామ పరిధిలో రైతులతో జరిగిన సమ న్వయ సమావేశంలో పాల్గొన్నారు. యూరియా కొరత లేకుండా పంపిణీ జరుగు తోందని అన్నారు. సమా వేశంలో ఎఒ రమాదేవి, రైతులు పాల్గొన్నారు.


కలకడ : రైతులకు యూరియా అందిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

# నేత్రదానంపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

**ప్రజాశక్తి-గుర్రంకొండ**

నేత్రదానం అవగాహన కలిగి ఉండటం అవసరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేతదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నేత్రదాన పక్షోత్సావాల్లో భాగంగా డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ కమలాకర్ అధ్యక్షతన విద్యార్థులకు నేత్రదానం ప్రాముఖ్యత, ఆవశ్యకత, ఎవరు నేత్రదానం చేయవచ్చు, ఎవరిని సంప్రదించాలనే టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి అవగాహన కల్పించారు. మనదేశంలో నేటికీ 1.2 మిలియన్ల మంది కార్నియల్ అంధత్వంతో బాధ పడుచున్నారని అన్నారు. ప్రతీ సంవత్సరం 20వేల నుండి 30వేల కొత్త కేసులు ఈ కార్నియల్ అంధత్వ కేసులు నమోదవుతున్నాయన్నారు. కార్నియ అంటే కంటి నల్ల గుడ్డు పైన పారదర్శకంగా ఉండే పొరని, ఈ పొరకు ఏదైనా గాయం అయి లేదా అంటు వల్ల స్వచ్ఛత పోతే కంటి చూపు పాక్షికంగా లేదా పూర్తిగా పోయే అవకాశముందన్నారు. దీనినే కార్నియల్ బ్లైండ్‌నెస్ అంటారన్నారు. ఏ వయసు వారైనాకళ్ళజోడు పెట్టుకునే వారు, షుగర్, బిపి, ఉబ్బసం వ్యాధులతో బాధపడే వారు కూడా నేత్ర దానం చేయవచ్చని తెలిపారు. మరణించిన ఆరు గంటల లోపు నేత్రలను తీయవలసి ఉంటుందని, మృతి వెంటనే దగ్గర లోని ఐ బ్యాంకు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. మరణించిన వ్యక్తి వద్ద ఫ్యాన్‌లు ఆపి వేసి ఎసి లేదా కూలర్లు ఆన్‌చేసి ఉంచాలని తెలిపారు. నేత్రదానాన్ని కుటుంబ వారసత్వంగా పాటించి ఇద్దరి అంధులకు చూపుని ద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కమలాకర్, అధ్యాపకులు, టిబి పర్యవేక్షకులు, మహబూబ్ బాషా, నాగిరెడ్డి, సిహెచ్ఒలు మహేష్, ఎఎన్ఎం జయలక్ష్మి, ఆశాకార్యకర్త, పాల్గొన్నారు.

## వృద్ధుడిపై పిచ్చికుక్క దాడి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

వృద్ధుడిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సంఘటన సోమవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ, చిలకుంట గ్రామానికి చెందిన రెడ్డప్ప నాయుడు ఇంటి ముందు కూర్చొని ఉండగా, అదే సమయంలో అటుగా వచ్చిన పిచ్చి కుక్క రెడ్డెప్పనాయుడి పై దాడిచేసిందని తెలిపారు. కరచి తీవ్రంగా గాయపరచడంతో గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాధితుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు.

## అన్నదాత పోరును విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-సుండుపల్లి**

మాజీ సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట జరిగే అన్నదాత పోరు కార్యక్రమంలో రైతులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని వైసిపి మండల కన్వీనర్ ఎం.రామస్వామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపు ఉదయం పది గంటలకు రైతుల ప్రధాన సమస్యలు అయిన యూరియా, రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని ఎరువులను పక్కదోవ చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వర్షాల కారణంగా దెబ్బతిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు ఆరంరెడ్డి, వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రెహమాన్‌ఖాన్, ఆనంద్ రెడ్డి, సుండుపల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్, సల్మాన్, పీఎన్ కాలువ ఉపసర్పంచ్ రఫీ, ఎస్‌టి నాయకుడు చంద్ర నాయక్, శివాలయం మాజీ చైర్మన్ శంకర పాల్గొన్నారు. **నందలూరు:** పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించే అన్నదాత పోరును విజయవంతం చేయాలని మండల కన్వీనర్ సిద్ధవరం గోపిరెడ్డి పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 నెలలు కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ పంటకు గిట్టుబాటు ధర ప్రకటించలేదని ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా, విత్తనాలు సకాలంలో అందజేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ నాయకులు గొబ్బిళ్ళ త్రినాధ్, నడివిడి సుధాకర్, గుండు మల్లికార్జున రెడ్డి, పల్లె గ్రీస్మంత్ రెడ్డి, ముమ్మడిశెట్టి సుధ, ఉప సర్పంచ్ ఇబ్బు, ఆనాల మధు యాదవ్, గోల్డ్ మస్తాన్, షేక్ రఫీ, విజయుడు, మాభాష తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు దూరం కానున్న వైద్య విద్య

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ప్రతిభ పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం పిపిపి విధానంలో వైద్య కళాశాలలను నిర్వహించేందుకు కుట్ర పన్నుతోందని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ ఆరోపించారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగంలో ఆరంభించిన 10 మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలనుకోవడం దారుణమన్నారు. ప్రైవేట్ ఆజమాయిషిలో ఫీజులు, అడ్మిషన్లలో డొల్లతనం అనేక సందర్భాల్లో బయటపడిందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని తెలిపారు. ప్రభుత్వం మొండిగా ప్రైవేటీకరణకే మొగ్గు చూపితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు కృష్ణప్ప , మురళి, సాంబశివ, తిరుమలప్ప, భవిత, సాయికిరణ్, నవ్య శ్రీ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## 13న విద్యుత్ శాఖ రాష్ట్ర స్థాయి సమావేశం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఈ నెల 13న రాష్ట్రస్థాయి విద్యుత్ శాఖలోని ఒసి ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు మదనపల్లె డివిజన్ ఓసి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రామలింగారెడ్డి, శేషాద్రి, నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ సమీపంలోని ఇబ్రహీం పట్టణం, విటిపి ఎస్‌లో నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, డివిజన్‌లోని నాయకులు, సభ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## 16న తంబళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 16న ఉదయం 11 గంటలకు ఎంపిపి అనసూయమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ థామస్ తెలిపారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి మండల ఉపాధ్యక్షులు ఎంపిటిసి సభ్యులు మండల కో-ఆప్షన్స్ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

## దుష్ప్రచారం చేస్తున్న వారిని వదలం

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి, టిడిపిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని వదలి పెట్టమని తెలుగు యువత రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు చంద్ర పేర్కొన్నారు. సోమవారం మాజీ సర్ప ంచ్ ఉత్తంరెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. తంబళ్లపల్లెలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక టిడిపి కార్యకర్తల పేరుతో సోషల్‌మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తు న్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

## 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేసి, వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా 30శాతం మధ్యంతర భృతి, చెల్లించవలసిన నాలుగు డిఎలను వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆపస్ సభ్యత్వ నమోదులో భాగంగా పట్టణంలో పలు పాఠశాలను సందర్శిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన రూ.25 వేల కోట్ల బకాయిలలో కేవలం సుమారు రూ.6వేల కోట్లు మాత్రమే చెల్లించిందని, కనీసం ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ సొమ్ము అవసరం మేరకు మంజూరు చేయడం లేదన్నారు. పెన్షనర్ల గ్రాట్యుటీ సంపాదిత సెలవు నగదు మంజూరు తీవ్ర కాలయాపన జరుగుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఎటువంటి చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వు 57 ప్రకారం 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడం, జూనియర్ కళాశాలల అధ్యాపకులుగా 40 శాతం పంచాయతీరాజ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతి కల్పించాలన్నారు. డిఒ పూల్‌లోని భాషా పండితులు, పిఇటిల ప్రమోషన్లు, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం తోపాటు మాతృభాషలో విద్యాబోధన, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో రెగ్యులర్ ప్రాతిపదికన పిజిటి నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నదన్నారు. వెంటనే ముఖ్యమంత్రి కల్పించుకొని ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధుమతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, మదనపల్లి మండల నాయకులు భీమ్లా నాయక్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసి డిపో మేనేజర్ బదిలీ

**ప్రజాశక్తి-పీలేరు**

పీలేరు ఆర్టీసీ డిపో మేనేజరుగా పనిచేస్తున్న బి.నిర్మల తిరుపతికి బదిలీ అయ్యారు. సోమవారం స్థానిక ఆర్‌టిసిఉద్యోగులు డిఎంను తన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పీలేరు డిపోకు ఇన్‌ఛార్జి డిఎంగా నిర్మల బాధ్యతలు చేపట్టారు. ఏడు నెలల కాలం పాటు పనిచేసిన డిఎం ఉద్యోగులతో మమేకమై డిపో అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం ఆమె తిరుపతి ఆర్‌టిసి కమర్షియల్ విభాగానికి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా బదిలీపై వెళుతున్నారని అన్నారు. ఈ స్థానంలో గూడూరు ఆర్టీసీ డిపో నుంచి మొహమ్మద్ రోషన్ పీలేరు డిపోకు ఇన్‌ఛార్జి మేనేజర్‌గా బదిలీపై రానున్నారు. ఈ సందర్భంగా ఆమెను పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిఐ ధనుంజయులు, బస్టాండ్ మేనేజరు బాబునాయక్, సిస్టం సూపర్వైజర్లు కెసియస్ రెడ్డి, హుసేన్, ఎడిసిలు ఎల్లయ్య, కెకె నాయుడు, పిఆర్ మోహన్, నరసింహారెడ్డి, పాల్గొన్నారు.



108 వాహనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా మేనేజర్

## ప్రభుత్వ ఆస్పత్రికి 108 అంబులెన్స్ మంజూరు

**ప్రజాశక్తి-పీలేరు**

స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి కొత్తగా అధునాతన ప్రాణ సంరక్షణ అపత్కాల వాహనం సమకూరింది. ప్రభుత్వం ద్వారా జిల్లాలోని పీలేరు, మొలకలచెరువు, మదనపల్లి, రాయచోటి, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రులకు కొత్తగా 5 అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు కేటాయించారు. అందులో పీలేరు ప్రాంతీయ ఆసుపత్రికి కూడా ఒక అధునాతన ప్రాణ సంరక్షణ ఆపత్కాల వాహనం వచ్చింది. ఈ అంబులెన్స్ ద్వారా పీలేరు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సహాయం అందుబాటులోకి రానుంది. జిల్లా 108 అంబులెన్స్‌ల మేనేజర్ సుబ్రమణ్యం ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో ఆ వాహనానికి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సంభవించే ప్రమాదాల్లో క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలు అందించుటలో ఈ అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ప్రాణరక్షకంగా నిలువనుంది. సాధారణ 108 వాహనాలతో పోలిస్తే ఇందులో అధునాతన సౌకర్యాలు మరింత అధికంగా ఉండడం వల్ల రోగి ప్రాణాలను కాపాడే అవకాశాలు పెరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో డివిజనల్ సూపర్వైజర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, 108 పైలెట్లు దామోదరం, రహంతుల్లా, మచ్చగంటి శ్రీనివాసులు, చంద్రమౌళి, టెక్నీషియన్లు ఉమశ్రీ, దేవేంద్ర, సతీష్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట :** పట్టణంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు తగుచర్యలు తీసుకుంటున్న విద్యుత్ శాఖ ఎఇ ముజిమిల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు 33కె బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నామని,ట్రిప్ చేసుకునే సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు.ఈ బ్రేకర్లు ఏర్పాటు వల్ల గతంలో బురకాయలకోట సబ్ స్టేషనుకు ఫోన్ చేసి ఎల్.సి తీసుకో వాల్సిన అవసరం వస్తూ ఉండేది.ఇప్పుడు 33కె బ్రేకర్ల వల్ల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన చోట నుంచి ఎల్‌సి ఆఫ్ చేసుకోవచ్చుని తెలిపారు. వచ్చే వినాయక చవితికి పట్టణంలో విద్యుత్ తీగలు రోడ్డు ఇరువైపులా లేకుండా ఒకవైపు నుంచి ఇప్పుడున్న 80 మీటర్ల స్తంభం కాకుండా 90 మీటర్ల స్తంభం ఏర్పాటు చేసి వినాయక చవితి విగ్రహాలకు విద్యుత్ శాఖ పట్టణంలో సమస్య లేకుండా తగుచర్యలు తీసుకుం టున్నామని ఎఇ తెలిపారు.

## పేదలకు వరం సిఎం సహాయనిధి :'చమర్తి'

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

నిరుపేద బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం రాజంపేట టిడిపి కార్యాలయంలో పలువురు నిరుపేద బాధిత కుటుంబాలకు సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కత్తి సుబ్బరాయుడు రూ.25,166లు, రాగి నూతల వెంకటరమణ రూ.20,254లు, కొప్పర్తి యానాదయ్య రూ.2.32లక్షలు, వెంకటసుబ్బయ్య రూ.45,798లు, పెంచలయ్యనాయుడు రూ.79,258 ల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద బాధిత కుటుంబాలకు భరోసా అందిస్తామన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా వాటన్నింటిని పక్కనపెట్టి పేదల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతిగా ఈ నిర్ణయం తీసుకున్నారనన్నారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం

**రాజంపేట అర్బన్ :** మండల పరిధిలోని ఊటుకూరు పంచాయతీకి చెందిన గుండ్లపల్లి రామరాజు కుమారుడు గుండ్లపల్లి భానుప్రకాష్‌రాజు కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును వారి కుటుంబ సభ్యులకు చమర్తి జగన్‌మోహన్‌రాజు అందించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. పార్టీలో ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, టిడిపి మండల ఉపాధ్యక్షులు సతీష్ రాజు, గీతాంజలి రమణ, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 'చమర్తి'ని కలిసిన జనసేన నాయకులు

**నందలూరు :**మండలంలోని సమస్యల పరిష్కార కృషి చేయాలని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజును ఉమ్మడి కడప జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్, నందలూరు జనసేన నాయకులు గురివిగారి వాసు కోరారు. జగన్‌మోహన్‌రాజుకు శాలువా కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమములో రాజంపేట జనసేన నాయకులు కేఎస్ నరసింహ, టిడిపి నందలూరు క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రవీణ్, జన సైనికులు అరుణ్ పాండే, శేఖర్, ప్రతాప్, బన్నీ, మనీష్, మోహన్, దినేష్ పాలుగొన్నారు.


రాజంపేట : బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న జగన్‌మోహన్‌రాజు